

ముప్పనపల్లి గ్రామంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతి

# నిస్వార్థంగా సేవచేస్తా..

- సీతక్కలా కాంట్రాక్టులు, కమీషన్లు లేవు
- అక్కున చేర్చుకుని గెలిపిస్తే అభివృద్ధి చేసిచూపిస్తా
- పగటి వేషగాళ్ల ఆరు గ్యారెంటీలను నమ్మొద్దు
- ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి
- కన్నాయిగూడెం మండలంలో విస్తృత ప్రచారం

కన్నాయిగూడెం, నవంబర్ 4 : ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేందుకే ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగానని బడే నాగజ్యోతి అన్నారు. శనివారం ఆమె కన్నాయిగూడెం మండలంలోని తుపాకుల గూడెం, లక్ష్మీపురం, దేవాదుల, రాజన్నపేట, కన్నాయిగూడెం, గుర్రేవుల, ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, కొత్తూరు, చింతగూడెం, ఏటూరు, సింగారం, కంతనపల్లి గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ 'నేను మీ ప్రభాకరన్న బిడ్డను, మీ అభీష్టం మేరకే మీ సేవలో ప్రాణాలు అర్పించాడు. ఆయన ప్రాణంగా నేను ఇప్పుడు మీ ముందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చాను. గెలిపించి అసెంబ్లీకి పంపించండి.' అని కోరారు. కాంగ్రెస్ నాయకుల్లా తనకు ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేవని తెలిపారు. ఎమ్మెల్యే సీతక్కలా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాంట్రాక్టులు, తొమ్మిదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో పొందిన కమీషన్లు లేవన్నారు. ఒక్క సారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని నాగజ్యోతి భావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ నాయకులు పగటి వేషగాళ్ల మాదిరి ఆరు గ్యారెంటీల పేరుతో ఓట్లను దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. గోదావరి అవతల ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి వంటి పథకాలు అమలు చేయడం లేదని, అలాంటిది తెలంగాణ రాష్ట్రంలో ఎలా అమలు చేస్తారన్నారు. తాను గెలువగానే ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. మండలంలో గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు అందించడంతో పాటు అసైన్డ్ భూములపై పూర్తి హక్కులను కల్పించేందుకు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చారని చెప్పారు. అలాగే మండల ప్రజల అభీష్టం మేరకు మండలకేంద్రంలో ప్రభుత్వ రంగ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని నాగజ్యోతి హామీ ఇచ్చారు. ప్రచారంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, సీనియర్ నాయకులు కావిరి చిన్ని కృష్ణ, మటం వెంకటేశ్, పూజారి కిశోర్, కుందారపు శ్రీనివాస్, సర్పంచులు అల్లెం ప్రభాకర్, కోరం సూర్యనారాయణ, కొట్టె ఉమామహేశ్వరి, కావిరి పద్మ, పూజారి లలిత, నారాయణ, సిద్దబోయిన సాగర్ పాల్గొన్నారు.



కన్నాయిగూడెం మండలకేంద్రంలో నాగజ్యోతి రాకకోసం వేచిచూస్తున్న గ్రామస్తులు, బీఆర్ఎస్ శ్రేణులు

# బంజారాలకు కాంగ్రెస్ చేసింది శూన్యం

- ఆ పార్టీని నమ్మితే కర్ణాటక కష్టాలు మొదలవుతాయి
- మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ 'హస్తం'
- గిరిజన యూనివర్సిటీ ఏర్పాటులో బీజేపీ అలసత్వం
- మంత్రి సత్యవతిరాథోడ్
- గోవిందరావుపేటలో బంజారాల ఆత్మీయ సమ్మేళనం



బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత, పక్కన మంత్రి సత్యవతిరాథోడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్

గోవిందరావుపేట, నవంబర్ 4 : గిరిజనులు, ఆదివాసీలు, బంజారాల సమగ్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో బంజారాలకు చేసింది శూన్యమని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కమ్మ సంఘం ఫంక్షన్‌హాల్‌లో బంజారాల ఆత్మీయ సమ్మేళనం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించగా మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని, తప్పుదారి వారు అధికారంలోకి వస్తే కర్ణాటక కష్టాలు మొదలవుతాయన్నారు. రైతులపై ప్రేమ, చిత్త శుద్ధితో సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గిరిజనులకు బీజేపీ అన్యాయం చేసిందని, 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో లంబాడ జాతికి వారు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్ల పాటు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకుండా కేంద్రంలోని బీజేపీ కాలయాపన చేసి గిరిజనులకు ద్రోహం చేసిందనన్నారు. నీళ్ల కోసం కిలో మీటర్ల కొద్దీ నడిచిన పరిస్థితుల నుంచి రాష్ట్రం వచ్చిన తర్వాత స్వయం పాలన దిశగా అడుగులు పడ్డాయన్నారు. పోడు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ములుగు జిల్లా ఏర్పాటు చేసుకొని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ములుగు నియోజకవర్గ అభ్యర్థి నాగజ్యోతిని ప్రజలు, బంజారాలు ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### నాగజ్యోతి గెలుపు ఖాయం : ఎంపీ మాలోత్ కవిత

ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనే ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపిస్తుందని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4వేల కోట్లతో గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. లంబాడీల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఏజెన్సీలోని తండాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తండాలను గుర్తించి జీపీ హోదా కల్పించడం ఎంతో శుభపరిణామమన్నారు. నాగజ్యోతి గెలుపును ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ మాట్లాడుతూ నేడు నిర్వహించిన లంబాడీల సమ్మేళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున లంబాడీ మహిళలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో నాగజ్యోతిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు, మండల అధ్యక్షుడు సాయికుమార్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, మహిళా నాయకురాలు సుమలత, నాయకులు భూక్యా దేవానాయక్, నర్సింహనాయక్, సురేశ్, వాగ, మోహన్‌రాథోడ్ పాల్గొన్నారు.

# పనిచేసేవారికి పట్టంకట్టండి

- దేవుళ్లపై నీచరాజకీయాలు చేసే చరిత్ర కాంగ్రెస్‌ది
- శాంతినగర్ వాసులకు ఇండ్ల డ్యామేజీ డబ్బులు వచ్చి ఉన్నాయి
- మరిన్ని కావాలంటే గెలిచిన వెంటనే సింగరేణితో మాట్లాడి తీసకొస్తా
- ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా
- భూపాలపల్లి పట్టణాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధిచేస్తా
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



హనుమాన్ నగర్‌లో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ, నవంబర్ 4 : పేదల అభివృద్ధే లక్ష్యంగా పని చేసే బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ పరిధి 20వ వార్డు శాంతినగర్, హనుమాన్ నగర్ కాలనీల్లో ఎమ్మెల్యే గండ్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం గండ్ర మాట్లాడుతూ ఐదేళ్లలో పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశానన్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యను వందశాతం తీర్చానని, పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పాటు నాలుగు లేన్ల రోడ్లు వేయించానన్నారు. భూపాలపల్లి ప్రస్థానం శాంతినగర్, హనుమాన్ నగర్ నుంచే మొదలైందని, కాలనీల్లో బస్తీబాట నిర్వహించి సమస్యలు పరిష్కరించానన్నారు. ఓపెన్ కాస్ట్ వల్ల శాంతినగర్, హనుమాన్ నగర్‌లో ఇండ్లకు నష్టం జరిగితే ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం అందించామన్నారు. మరికొన్ని డబ్బులు కూడా జీఎం అకౌంట్‌లో ఉన్నాయన్నారు. ఈ ప్రాంత పరిస్థితులను బట్టి మరికొంత పరిహారం కావాలని అడుగుతున్నారని, గెలిచిన వెంటనే సింగరేణితో మాట్లాడి మరిన్ని డబ్బులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. వారాంతపు సంత వల్ల రెండు కాలనీలకు ఇబ్బంది అవుతున్నదని, తన దృష్టికి వచ్చిన వెంటనే సంతను తీసేసి నేడు నూతన హంగులతో బస్‌డిపో పక్కన మార్కెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురుకులాలు, కళాశాలు తీసుకొచ్చి భూపాలపల్లిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దానన్నారు. పట్టణ ప్రజలు ఒక్కసారి ఆలోచించి అభివృద్ధి, సంక్షేమాన్ని సమదృష్టితో చూస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తనకు మళ్లీ అవకాశం ఇస్తే మాస్టర్ ప్లాన్‌తో భూపాలపల్లిని అభివృద్ధి చేస్తానన్నారు. రూ.105 కోట్లతో ప్రత్యేక డ్రైనేజీలు, జిల్లాకు మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాల తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.400కే వంట గ్యాస్, ప్రతి ఇంటికి రూ.5 లక్షల ప్రమాద బీమా, ఆరోగ్య పథకం ద్వారా రూ.15లక్షలు, సౌభాగ్యలక్ష్మి ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ.3వేలు, ఇంటింటికీ సన్నబియ్యం అందిస్తామన్నారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు దేవుళ్లపై నీచ రాజకీయాలు చేస్తున్నారని, సరైన సమయంలో దేవుళ్లే వారికి బుద్ధిచెప్తారన్నారు.

### మనసున్న మహరాజు.. గండ్ర

*– భూపాలపల్లి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సారయ్య*

గండ్ర వెంకటరమణారెడ్డి మనసున్న మహరాజు అని, నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా పని చేసే నాయకుడని భూపాలపల్లి ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా గండ్ర కుమారుడు గౌతంరెడ్డి సహకారంతో 4వేల మంది నిరుద్యోగులకు డ్రైవింగ్ నేర్పించి, ఉచితంగా లైసెన్స్ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. యువతకు కోచింగ్ ఇవ్వడంతో పాటు ఉచితంగా రుచికరమైన భోజన సౌకర్యం కల్పించారన్నారు. 100 పడకల దవాఖానలో రోగితో పాటు రోగి అటెండర్‌కు మధ్యాహ్న భోజనం ప్రతి రోజు అందిస్తున్నారని తెలిపారు. ప్రచారంలో మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, 21వ వార్డు కౌన్సిలర్ జక్కం రవి కుమార్, టీబీజీకేఎస్ బ్రాంచి కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, ఎస్సీ సెల్ అర్బన్ అధ్యక్షుడు మోకిడ అశోక్, 20వ వార్డు అధ్యక్షుడు రడపాక రమేశ్, బీఆర్ఎస్ నాయకులు బీబీచారి, అల్టూరి కుమార్, బుర్ర సదానందం, రాజు, చుక్క బాలరాజు, అబ్జల్, పందిల్ల రమేశ్, దొంగల శంకర్, రాజు నాయక్, మల్లేశ్ గౌడ్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

